నిధులు ఫుల్..
పనులు నిల్ !

- చినుకు పడితే చెరువును తలపిస్తుంది
- కుమ్మరిపాలెం సెంటర్‌లో దయనీయ స్థితి
- క్రాస్ కల్వర్ట్ సరే.. అక్కడి నుంచి డ్రెయిన్ నిర్మాణం చేపట్టని వైనం



చిన్నపాటి వర్షానికే చెరువును తలపిస్తున్న కుమ్మరిపాలెం సెంటర్(ఫైల్)

భవానీపురం(విజయవాడపశ్చిమ): విద్యాధరపురం కుమ్మరిపాలెం సెంటర్ నుంచి గుప్తా సెంటర్ వరకు అవుట్‌ఫాల్ డ్రెయిన్ నిర్మాణానికి అవసరమైన నిధులు ఫుల్‌గా ఉన్నా పనులు మాత్రం నిల్. 'అంగట్లో అన్నీ ఉన్నా.. అల్లుడి నోట్లో శని' అన్న చందాన 39వ డివిజన్ పరిధిలో ఈ అభివృద్ధి పని నిమిత్తం గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలోనే(2023) నగరపాలక సంస్థ జనరల్ ఫండ్స్ నుంచి రూ.34 లక్షలు మంజూరయ్యాయి. తిరుపాల్ అనే వ్యక్తి టెండర్ కూడా దక్కించుకున్నాడు. ఆ తరువాత ఎలక్షన్ కోడ్ అమలులోకి రావడంతో పనులు మొదలు పెట్టడంలో జాప్యం జరిగింది. ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి మూడు నెలలు దాటినా కాంట్రాక్టర్ ఎందుకు ముందుకు రావడం లేదన్నది ప్రశ్నార్థకంగా మారింది. నగరపాలక సంస్థ జనరల్ ఫండ్స్ నుంచి నిధులు మంజూరయ్యాయంటే.. పని పూర్తయితే బిల్లు కచ్చితంగా వస్తుందన్నది కాంట్రాక్టర్లకు తెలిసిన విషయమే. అయినా ఇంత వరకు దాదాపు అర కిలోమీటర్ దూరం మేరకు అవుట్‌ఫాల్ డ్రెయిన్ నిర్మాణ పనులు ప్రారంభించ లేదంటే పాలకుల నిర్లక్ష్యమా లేదంటే అధికారుల అలసత్వమా? అని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. అధికారంలోకి వస్తే నియోజకవర్గాన్ని ఎక్కడికో తీసుకువెళతానని ఎన్నికలకు ముందు హామీలు గుప్పించిన ఎమ్మెల్యే సుజనా చౌదరి గెలవగానే నియోజకవర్గానికి అప్పుడప్పుడు వచ్చే విజిటింగ్ ప్రొఫెసర్‌గా మారారని, ఎవరిని అడగాలని స్థానిక ప్రజలు తలలు పట్టుకుంటున్నారు.



అవుట్‌ఫాల్ డ్రెయిన్ నిర్మాణం చేపట్టాల్సింది ప్రాంతం

చినుకు పడితే చెరువే..

చినుకు పడిందంటే చాలు 38–39 డివిజన్లకు అనుసంధానంగా ఉన్న కుమ్మరిపాలెం సెంటర్‌లో రహదారి జలమయమై చెరువును తలపిస్తుంది. ఇక్కడ డ్రెయినేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉండటమే అందుకు ప్రధాన కారణం. ఈ సమస్యకు పరిష్కార మార్గం స్థానిక పెద్దలకు తెలిసినంతగా వీఎంసీ ఇంజనీరింగ్ అధికారులకు కూడా తెలియదంటే అతిశయోక్తి కాదు. మేం చెబుతున్నా.. మీరు మాకు చెప్పేదేంటన్న అహంతో పట్టించుకోకుండా వెళ్లిపోవడమే ఈ ముంపు దుస్థితికి కారణమని విశ్రాంత ఇంజినీరింగ్ అధికారులు వ్యాఖ్యానిస్తున్నారు. అప్పటి నుంచి వారు కూడా అధికారులకు చెప్పటం మానేసి ముంపు కష్టాలకు అలవాటు పడిపోయారు.

స్థానికుల అసంతృప్తి..

విద్యాధరపురం కొట్టేటి కోటయ్య వీధి (38వ డివిజన్) కొండ ప్రాంతం నుంచి పెద్ద ఎత్తున దిగువకు వచ్చే వర్షపు నీటి ఎద్దడిని తట్టుకునేందుకు డీఎస్ఎం హైస్కూల్ (39వ డివిజన్) వద్ద గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో రూ.9.30 లక్షలతో క్రాస్ కల్వర్ట్ పనులు పూర్తి చేశారు. ఇక్కడి వరకు బాగానే ఉన్నా. కొండపై నుంచి భారీగా వచ్చే వర్షపు నీరు క్రాస్ కల్వర్ట్ ద్వారా రోడ్ పక్కన అవుట్‌ఫాల్ డ్రెయిన్‌లోకి వెళ్లాల్సి ఉంది. అయితే ఆ డ్రెయిన్ నిర్మాణం చేపట్టక పోవడంతో కల్వర్ట్ వలన ప్రయోజనమేమిటని స్థానికులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. కూటమి ప్రభుత్వంలో ఉన్న టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు డివిజన్‌లో హడావుడి చేయడం తప్ప ప్రజా సమస్యలను పట్టించుకుని పరిష్కరించేవారే లేరని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం 'యథా కూటమి ప్రభుత్వం.. తథా కూటమి నాయకులు' అన్న చందాన పరిస్థితులు నెలకొన్నాయని స్థానికులు వ్యాఖ్యానిస్తున్నారు.

ఆకట్టుకున్న సైబర్ మారథాన్



ఇంద్రకీలాద్రి వద్ద భక్తులకు అవగాహన కల్పిస్తున్న స్కేటర్లు

విజయవాడస్పోర్ట్స్: ఇంద్రకీలాద్రి వద్ద విజయవాడ స్కేటర్లు శనివారం నిర్వహించిన సైబర్ మారథాన్ దుర్గమ్మ భక్తులను ఆకట్టుకుంది. ఎన్టీఆర్ జిల్లా సైబర్ క్రైమ్ పోలీసుల పర్యవేక్షణలో వినాయకస్వామి టెంపుల్ నుంచి కుమ్మరిపాలెం వరకు సాగిన ఈ మారథాన్‌లో 35 మంది స్కేటర్లు పాల్గొన్నారు. క్యూ లైన్లలోని భక్తులకు సైబర్ నేరాలపై అవగాహన కలిగేలా ప్లకార్డులను ప్రదర్శిస్తూ ముందుకు సాగారు. ఫిషింగ్, డిజిటల్ అరెస్ట్, లోన్ యాప్స్ తదితర ఆన్‌లైన్ మోసాలపై స్కేటర్లు అవగాహన కల్పించిన తీరు అమ్మవారి భక్తులను ఆలోచింపజేసింది. అత్యాశకు పోయి సైబర్ నేరగాళ్ల వలలో చిక్కొద్దని, చేతిలోని స్మార్ట్ ఫోన్‌ను జాగ్రత్తగా వినియోగిస్తే సైబర్ నేరాల బారీ నుంచి తప్పించుకోవచ్చని సూచించారు. తెలిసో.. తెలియకో సైబర్ నేరగాళ్ల వలలో చిక్కుకుంటే గోల్డెన్ అవర్(గంట లోపే) 1930 లేదా సైబర్ పోలీసులను సంప్రదించి ఫిర్యాదు చేయాలని కోరారు.

క్లుప్తంగా

వరద ముంపు ప్రాంత యువతకు శిక్షణ

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): వరద ముంపు ప్రాంతాల్లోని యువతకు శ్రీ సత్యసాయి సేవా సంస్థల ఆధ్వర్యంలో ఏసీ రిపేర్, కుట్టు మిషన్ శిక్షణ ఏర్పాటు చేస్తున్నట్లు సంస్థల ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు బీవీఎస్టీ సాయి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. త్వరలో రాజీవ్‌నగర్‌లోని భారత్ వికాస్ పరిషత్ భవనంలో శిక్షణ ప్రారంభించనున్నట్లు చెప్పారు. పదో తరగతి పాస్ లేదా ఫెయిల్ అయిన 19–30 మధ్య వయస్సు ఉన్న వారు శిక్షణకు అర్హులని పేర్కొన్నారు. శిక్షణలో భాగంగా మధ్యాహ్నం ఉచిత భోజన సౌకర్యం కల్పిస్తామన్నారు. 37 రోజుల పాటు శిక్షణ ఇస్తామని, అనంతరం ప్రఖ్యాత ఏసీ కంపెనీలలో ప్లేస్‌మెంట్ కల్పిస్తామన్నారు. అలాగే 50 మంది మహిళలకు టైలరింగ్, ఫ్యాషన్ డిజైనింగ్‌లో ఉచిత శిక్షణ శ్రీ శారద విద్యాలయం, శాంతినగర్‌లో ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. పూర్తి వివరాలకు 99512 84459, -78934 16244, 99485 57070, 81252 66864 ఫోన్ నంబర్లలో సంప్రదించాలని కోరారు.

దేవుళ్లు, దేవాలయాలతో రాజకీయాలు వద్దు



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దేవుళ్లు, దేవాలయాలను అడ్డుపెట్టుకుని రాజకీయాలు చేయవద్దని వైఎస్సార్ సీపీ నేత పోతిన మహేష్ విజ్ఞప్తి చేశారు. ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో జరుగుతున్న దసరా ఉత్సవాల్లో భాగంగా అన్నపూర్ణాదేవి అలంకారంలో అమ్మవారిని శనివారం ఆయన దర్శించుకున్నారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో మీడియాతో మాట్లాడారు. అమ్మవారి ఆలయానికి మాజీ సీఎం వైఎస్ జగన్ రూ. 70 కోట్ల నిధులను కేటాయించి శాశ్వత ప్రాతిపదికన అభివృద్ధి పనులు చేపట్టారన్నారు. ఆయా అభివృద్ధిని పరిగణనలోకి తీసుకుని ప్రస్తుత ప్రభుత్వం మరింత కృషి చేయాలన్నారు. కేంద్రం నుంచి దుర్గగుడి అభివృద్ధికి రూ.వంద కోట్లు తీసుకువస్తానని ఎంపీ కేశినేని చిన్ని ప్రకటించారని, ఆ నిధులు మంజూరు చేయించి ఆలయాన్ని అభివృద్ధి చేయాలని కోరారు.

ప్రశాంతంగా ఏపీ టెట్ ఆన్‌లైన్ పరీక్షలు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): ఏపీ టీఈటీ -2024 ఆన్‌లైన్ పరీక్షలు మూడో రోజు శనివారం ప్రశాంతంగా జరిగాయి. ఎన్టీఆర్ జిల్లా, ఖమ్మం జిల్లాలో ఏడు కేంద్రాల్లో శనివారం పరీక్షలు జరిగాయి. మూడో రోజు 2,249 మంది అభ్యర్థులను కేటాయించగా 1,911 మంది హాజరయ్యారు. 338 మంది అభ్యర్థులు గైర్హాజరయ్యారు. శ్రీవాహిని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ, (తిరువూరు), ఐయాన్ డిజిటల్ జోన్ (కంచిక, విజయవాడ), ఎస్వీ ఇన్ఫోటెక్ (రామమందిరం రోడ్డు విజయవాడ), లైఫ్‌బ్రిడ్జి ఇన్ఫో టెక్నాలజీస్ (గొల్లపూడి విజయవాడ), శ్రీ విజయదుర్గ ఐటీ ఇన్ఫో సొల్యూషన్స్ (ఎనికేపాడు విజయవాడ రూరల్), దారిపల్లి అనంత రాములు కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ (ఖమ్మం), విజయ ఇంజనీరింగ్ కాలేజ్ (ఖమ్మం) తదితర పరీక్ష కేంద్రాల్లో ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ, మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం ఐదు గంటల వరకూ జరిగాయి. మొదటి షిఫ్ట్‌లో 1,279 మంది అభ్యర్థులను పరీక్షకు కేటాయించగా అందులో 1,109 మంది హాజరయ్యారు. 168 మంది గైర్హాజరయ్యారు. రెండో షిఫ్ట్‌లో 977 మందికి 802 మంది హాజరయ్యారు.

పొట్టి శ్రీరాములు కాలేజీలో దసరా సంబరాలు



వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): పొట్టిశ్రీరాములు చలవాది మల్లికార్జునరావు కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ కళాశాల ప్రాంగణంలో దసరా సంబరాలు శనివారం అత్యంత వైభవంగా నిర్వహించారు. కళాశాలలోని సీఎస్ఈ, డేటా సైన్స్, ఎంటర్‌టైన్‌మెంట్ క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ సంబరాలను నిర్వహించారు. ఈ సందర్భంగా నవదుర్గలు నృత్య రూపకాన్ని ప్రదర్శించారు. అమ్మవారి అవతారాలను విద్యార్థులు చక్కగా ప్రదర్శించి ఆకట్టుకున్నారు. అంతేకాకుండా విద్యార్థులు సంప్రదాయ వస్త్రధారణతో సందడి చేశారు. విద్యార్థులకు రంగోలీ, సంప్రదాయ వంటకాల పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల కార్యదర్శి చిట్టా అమర్‌సుధీర్ మాట్లాడుతూ విద్యార్థులు సంస్కృతీ, సంప్రదాయాలను గురించి తెలుసుకునేందుకు, వాటిని ఆచరించేందుకు ఈ విధమైన కార్యక్రమాలు దోహదపడతాయన్నారు. అనంతరం అతిథుల చేతుల మీదుగా బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షులు మాజేటి సురేంద్రనాథ్, సహాయ కార్యదర్శి పవన్‌కుమార్, కోశాధికారి కె.రాఘవయ్య, ప్రిన్సిపాల్ డాక్టర్ ఏ.పతంజలిశాస్త్రి, విభాగాధిపతులు షేక్ అక్బర్, నవ్యశ్రీ తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్యం, నగరాభివృద్ధిపై దృష్టి పెట్టండి



అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర

పటమట(విజయవాడతూర్పు): నగరంలో దసరా ఉత్సవాలు జరుగుతున్నప్పటికీ వీఎంసీ పరిధిలోని అన్ని డివిజన్లలో పారిశుద్ధ్య నిర్వహణ, నగరాభివృద్ధి పనుల్లో ఎలాంటి ఆటంకాలు లేకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర అన్నారు. వీఎంసీ ప్రధాన కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ రూమ్‌లో శనివారం ఆయన దసరా ఉత్సవాల ఏర్పాటు నగర పారిశుద్ధ్య నిర్వహణ, అభివృద్ధిపై శాఖాధిపతులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కమిషనర్ శాఖాధిపతులందరితో విజయవాడ నగరపాలక సంస్థ పరిధిలో ఉన్న సమస్యలపై చర్చించారు. శాఖాధిపతులు అందరూ వరదలు తర్వాత వారి వారి శాఖల్లో ఉన్న మరమ్మతులు, వాటికి తీసుకున్న చర్యలు, చేపట్టాల్సిన పనులపై ఆరా తీశారు. సమస్యలన్నీ సమన్వయంతో పరిష్కరించేలా తగు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నగరంలో ఖాళీ స్థలాల్లో పార్కులను అభివృద్ధి చేయాలని, ఉన్న పార్కుల్లో ఎటువంటి సమస్యలున్నాయో, వాటి మరమ్మతులకు తీసుకోవాల్సిన చర్యలపై నివేదిక ఇవ్వాలని డెప్యూటీ డైరెక్టర్ హార్టికల్చర్ రామ్మోహన్‌ను ఆదేశించారు. విజయవాడ నగరపాలక సంస్థకు నూతనంగా విధులు స్వీకరించిన చీఫ్ ఇంజినీర్, సూపరింటెండెంట్ ఇంజినీర్లర్లు స్వయంగా ఫీల్డ్‌లో వెళ్లి అక్కడ ఉన్న సిబ్బందితో మాట్లాడి సమస్యలు, వాటి పరిష్కారాలతో నివేదికతో రావాలని ఆదేశించారు. సమావేశంలో అడిషనల్ కమిషనర్(ప్రాజెక్ట్స్) చంద్రశేఖర్, చీఫ్ సిటీ ప్లానర్ జీవీజీఎస్‌వీ ప్రసాద్, చీఫ్ ఇంజనీర్ ఆర్.శ్రీనాథ్‌రెడ్డి, డెప్యూటీ కమిషనర్(రెవెన్యూ) జి.సృజన, సూపరింటెండెంట్ ఇంజనీర్(వర్క్స్) పి.సత్యనారాయణ, సూపరింటెండెంట్ ఇంజినీర్లు(ప్రాజెక్ట్స్) పి.సత్యకుమారి, డెప్యూటీ డైరెక్టర్ హార్టికల్చర్ రామ్మోహన్, అసిస్టెంట్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ బాబు శ్రీనివాస్, ఎస్టేట్ ఆఫీసర్ టి.శ్రీనివాస్, అకౌంట్స్ ఆఫీసర్ బి.సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా చండీయాగం



ద్వి శత చండీయాగంలో పాల్గొన్న భక్తులు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): కేబీఎన్ కళాశాల ఆవరణలో ఉన్న శ్రీ దాసాంజనేయస్వామి వారి దేవస్థానం ప్రాంగణంలో శ్రీ రుద్ర సహిత ద్విశత చండీయాగం మూడో రోజు శాస్త్రోక్తంగా జరిగింది. శ్రీ కన్యకా పరమేశ్వరీ విస్సంశెట్టి వేంకటరత్నం హిందూ హైస్కూల్స్ కమిటీ ఆధ్వర్యంలో లోకకల్యాణార్థం దసరా ఉత్సవాల్లో భాగంగా శ్రీ రుద్ర సహిత ద్విశత చండీయాగ మహోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. ఉత్సవాన్ని పురస్కరించుకొని పలు ప్రత్యేక వైదిక కార్యక్రమాలను ఉదయం నుంచి సాయంత్రం వరకు కొనసాగించారు. చండీయాగంలో 108 మంది, అనంతరం అమ్మవారికి నిర్వహించిన సామూహిక కుంకుమార్చనలో 108 మంది మహిళలు పాల్గొన్నారు. అమ్మవారి అలంకారానికి సంబంధించిన మూలమంత్ర సంపుటితో చండీ హోమం నిర్వహించారు. అలాగే రుద్ర, శ్రీరామ, అంజనేయ, సుదర్శన, లక్ష్మీగణపతి, గరుడ, మహాలక్ష్మి, మృత్యుంజయ, మన్యుసూక్త, నవగ్రహ హోమాలను జరిపారు. కార్యక్రమంలో హిందూ హైస్కూల్స్ కమిటీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గొమ్మండ్రు శేషయ్య, గోపిశెట్టి మల్లయ్య, కోశాధికారి గోళ్ల బాబావిజయకుమార్, కేబీఎన్ కళాశాల అధ్యక్ష, కార్యదర్శులు ఉసిరిక ఉమామహేశ్వరరావు, తూనికుంట్ల శ్రీనివాసు తదితరులు పాల్గొన్నారు.

కూలిన వాటర్ ట్యాంక్ ప్రహరీ



ప్రైజర్‌పేటలో కూలిన వాటర్ ట్యాంక్ ప్రహరీ

వించిపేట(విజయవాడపశ్చిమ): స్థానిక 49వ డివిజన్ ప్రైజర్‌పేటలోని వాటర్ ట్యాంక్ ప్రహరీ శనివారం రాత్రి ఒక్కసారిగా కుప్పకూలి కింది నివాసాల మీద పడింది. ఈ ఘటనలో అప్పటి వరకు అక్కడే పనులు చేసుకుంటున్న మహిళా లోపలికి వెళ్లడంతో ప్రాణాపాయం తప్పింది. ఈ ఘటనలో అక్కడే ఉన్న విద్యుత్ స్తంభం పూర్తిగా వంగిపోవడం చూస్తే ప్రమాదం తీవ్రత స్పష్టంగా కనిపిస్తుంది. సుమారు 60 ఏళ్ల ప్రైజర్‌పేటలోని కృపానందం వీధిలో భూగర్భ వాటర్ ట్యాంక్ నిర్మాణం చేపట్టి దాని చుట్టు కొండ రాళ్లతో ప్రహరీ నిర్మించారు. ఈ ప్రహరీని అనుకొని కొండప్రాంతం నుంచి సైడు డ్రెయిన్ నిర్మాణం చేపట్టారు. అదే విధంగా వాటర్ ట్యాంక్ ఓవర్ ఫ్లో నీరు కూడా ఈ సైడు డ్రెయిన్ నుంచే పారుతుంటుంది. ఏళ్ల క్రితం నిర్మాణం చేపట్టిన ఈ ప్రహరీ శిథిలావస్థకు చేరుకుని తరచూ వాటర్ ట్యాంక్‌లోని ఓవర్ ఫ్లో, డ్రెయినేజీ లీకేజీలే ఏర్పాడి నివాసాలమీదుగా రోడ్లపై పారుతుటుంది. దీనిపై స్థానికులు అనేకసార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవట్లేదని స్థానికులు వాపోతున్నారు. ఈ క్రమంలో శనివారం రాత్రి పెద్ద శబ్దంతో ప్రహరీ కూలడంతో వాటర్ ట్యాంక్‌లోని ఓవర్ ఫ్లో నీరు పెద్ద ప్రవాహంతో దిగువ ప్రాంతంలోకి పారింది. దీనిపై సమాచారం అందటంతో వాటర్ సెక్షన్ ఏఈ ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. ప్రహరీని తొలగించి నూతనంగా నిర్మాణం చేపట్టనున్నట్లు ఆయన తెలిపారు.

చంద్రబాబు జీవితమంతా ప్రజలను మాయ చేయటమే



మాట్లాడుతున్న షేక్ ఆసిఫ్

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): చంద్రబాబునాయుడు జీవితమంతా ప్రజలను మాయ చేసి అధికారంలోకి రావటమేనని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పొలిటికల్ అడ్వైజర్ కమిటీ సభ్యుడు షేక్ ఆసిఫ్ అన్నారు. తిరుపతి లడ్డూ వ్యవహారంలో అదే తీరుగా ప్రజలను మాయ చేసి తాను ఇచ్చిన వాగ్దానాలను తప్పించుకునే కుట్రలు చేస్తున్నారని ఆయన దుయ్యబట్టారు. ఈ సందర్భంగా ఆయన కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. చంద్రబాబు టీటీడీకి సంబంధించిన లడ్డూ ప్రసాదం, విశిష్టతలపై అసత్యాలను ప్రచారం చేశారన్నారు. కోట్లాది ప్రజల మనోభావాలను దెబ్బతీశారని దుయ్యబెట్టారు. ఆలయాలను, దేవుళ్లను రాజకీయాలకు వాడుకోవటం చంద్రబాబుకు కొత్త కాదన్నారు. ఆనాడు విజయవాడలో 30 ఆలయాలను ధ్వంసం చేసినప్పుడు కూటమి నేతలకు హిందుత్వం గురించి గుర్తుకు రాలేదా అని ప్రశ్నించారు. 2014లోనూ చంద్రబాబునాయుడు రైతు రుణమాఫీ చేస్తానని వాగ్దానం చేసి ఎగ్గొట్టారని గుర్తు చేశారు. అన్ని విషయాలు ప్రజలు గమనిస్తున్నారన్నారు. ప్రతి మాటలోనూ అసత్యం తప్ప నిజం పలకని చంద్రబాబు నైజాన్ని ప్రజలు గుర్తిస్తున్నారని చెప్పారు.

ఆలయాల్లో ఆధ్యాత్మిక శోభ



గాయత్రీదేవిగా భ్రమరాంబ మాత



గాయత్రీదేవిగా మహాలక్ష్మి అమ్మవారు



గాయత్రీదేవిగా పోలేరమ్మ

దసరా శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా మూడో రోజైన శనివారం అమ్మవార్లు అన్నపూర్ణాదేవిగా దర్శనమిచ్చారు. నగరంలోని పలు ఆలయాల్లో విశేష పూజలు, అర్చనలు, హోమాలు నిర్వహించారు. దీంతో ఆలయాల్లో ఆధ్యాత్మిక శోభ నెలకొంది. పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవార్లను దర్శించుకున్నారు. ఆలయ కమిటీలు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

– వన్‌టౌన్, చిట్టినగర్, భవానీపురం(విజయవాడపశ్చిమ)

క్యూలైన్లను పరిశీలించిన సీపీ

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): దసరా ఉత్సవాల్లో భాగంగా శనివారం రాత్రి ఆలయ పరిసరాల్లో ఏర్పాట్లను ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ రాజశేఖరబాబు పరిశీలించారు. ఆదివారం భక్తుల రద్దీ భారీగా పెరిగే అవకాశం ఉండటంతో అధికారులను అప్రమత్తం చేశారు. అందులో భాగంగా సీపీ రాజశేఖరబాబు డీసీపీ గౌతమి షాలి, ఏడీసీపీ రామకృష్ణ, ఇతర ఏసీపీలు క్యూలైన్లను పరిశీలించారు. ఆయా ఏర్పాట్లను విస్తృతం చేయాల్సిన అవసరాన్ని అధికారులతో చర్చించారు. అమ్మవారిని దర్శించుకున్న భక్తులు త్వరగా బయటకు వెళ్లేందుకు ఏర్పాట్లు చేయాలని సూచించారు.

కనకదుర్గమ్మకు నృత్య నీరాజనం

విజయవాడ కల్చరల్: కనకదుర్గా నగర్‌లోని కళావేదికపై నిర్వహిస్తున్న సాంస్కృతిక కార్యక్రమాలు వైభవంగా కొనసాగుతున్నాయి. శనివారం నాటి కార్యక్రమాలు కె.రత్నకుమారి బృందం దివ్యనామ సంకీర్తనతో ప్రారంభమయ్యాయి. సుచిత, ఆకురాతి కోదండ రామయ్య, ఎం.నాగలక్ష్మి భక్తి కీర్తనలు ఆలపించారు. సంప్రదాయ నృత్యంలో భాగంగా ఎ.గాయత్రి. యల్లాజోస్యుల అనూరాధ, రాయన శ్రీనివాసరావు, సాహితీ అయ్యంగార్, శైలజ, వాసుదేవరావు, లక్ష్మీ సౌజన్య తమ బృందాలతో అష్టలక్ష్మీవైభవం, శృంగాలలహరి, అన్నమయ్య, రామదాసు, త్యాగరాజ స్వామి తదితర వాగ్గేయకారులు రచించిన కీర్తనలకు నృత్యాలు అభినయించారు. సాంస్కృతిక కార్యక్రమాల నిర్వాహకుడు సైదా, రామకృష్ణ నిర్వహించారు.

ఉచిత ఇసుక విధానం వెంటనే అమలు చేయాలి



పాత ఆర్‌ఆర్‌పేటలో నిరసన వ్యక్తం చేస్తున్న కార్పొరేటర్ సత్యబాబు, కార్మికులు

వించిపేట(విజయవాడపశ్చిమ): కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నాలుగు నెలలు అవుతున్నా ఎన్నికలకు ముందు ప్రకటించిన ఉచిత ఇసుక హామీని అమలు చేయకుండా భవన నిర్మాణ రంగ కార్మికులను రోడ్డు పాలు చేస్తుందని సీపీఎం 50వ డివిజన్ కార్పొరేటర్ బోయి సత్యబాబు ఆరోపించారు. ఉచిత ఇసుక హామీని అమలు చేయాలని డిమాండ్ చేస్తూ సీపీఎం ఆధ్వర్యంలో పాత ఆర్‌ఆర్ పేటలో భవన నిర్మాణ కార్మికులతో ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న కార్పొరేటర్ సత్యబాబు మాట్లాడుతూ.. ఉచిత ఇసుక అందించడంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. రాష్ట్రంలో ఇంత జరుగుతున్నా పవన్ కళ్యాణ్ మాత్రం తనకేమీ పట్టనట్లు మతాల మధ్య చిచ్చు పెడుతున్నారని, ఒకసారి కళ్లు తెరచి ప్రజల కష్టాలను చూడాలని హితవు పలికారు. వెంటనే ఉచిత ఇసుకను అందుబాటులోకి తీసుకురావాలని లేనిపక్షంలో కార్మికులతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళనలు, ఇసుక సత్యాగ్రహం చేస్తామని ఆయన హెచ్చరించారు.

సీఎన్‌జీ బజాజ్ ఫ్రీడమ్ 125 బైక్ ఆవిష్కరణ



బైక్‌ను విడుదల చేస్తున్న ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్, బజాజ్ రీజినల్ మేనేజర్స్

లబ్బీపేట(విజయవాడతూర్పు): బజాజ్ ఆటో వారు ప్రవేశపెట్టిన మొట్టమొదటి సీఎన్‌జీ బజాజ్ ఫ్రీడమ్ 125 బైక్‌ను శనివారం లాంఛనంగా నగర మార్కెట్‌లోకి విడుదల చేశారు. బజాజ్ డీలర్ వరుణ్ బజాజ్ ఆధ్వర్యంలో బెంజిసర్కిల్ సమీపంలోని లారీ ఓనర్స్ అసోసియేషన్ హాలులో జరిగిన కార్యక్రమంలో తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ సరికొత్త బైక్‌ను బజాజ్ ఆటో రీజినల్ మేనేజర్(సేల్స్) సీఎస్ కరుణాకర్, రీజినల్ మేనేజర్ సర్వీసు సచిన్ జైన్‌లతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వరుణ్ బజాజ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పీవీ సత్యనారాయణ మాట్లాడుతూ.. తమ 25వ వార్షికోత్సవం జరుపుకుంటున్న వేళ సరికొత్త ఫ్రీడమ్ బైక్‌ను మార్కెట్‌లోకి విడుదల చేయడం చాలా సంతోషంగా ఉందన్నారు. పెట్రోలు, సీఎన్‌జీ కోసం ప్రత్యేకంగా డిజైన్ చేశామన్నారు. ఇందులో రెండు రకాల ఫ్యూయల్స్‌ను వాడుకోవచ్చని చెప్పారు. మూడు వేరియంట్లలో లభిస్తుందన్నారు.



అమ్మవారిని దర్శించుకునేందుకు క్యూలైన్‌లో వేచి ఉన్న భక్తులు



అన్నపూర్ణాదేవికి ప్రత్యేక పూజలు చేస్తున్న ఆలయ అర్చకులు



హారతులు అందుకుంటున్న భక్తులు



పూజ నిర్వహిస్తున్న అర్చకుడు

అన్నపూర్ణాదేవీ... రక్షించుమాతా

ఇంద్రకీలాద్రిపై కొలువుదీరిన దుర్గమ్మ సన్నిధిలో దసరా మహోత్సవాలు కనులపండువగా కొనసాగుతున్నాయి. శనివారం అమ్మవారు అన్నపూర్ణాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. - సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ

వరద బాధితులకు ఎస్‌జేసీ ఫౌండేషన్ చేయూత



వించిపేట(విజయవాడపశ్చిమ): కర్నాటక రాష్ట్రం, హుబ్లీకి చెందిన ఎస్‌జేసీ మెమోరియల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నగరంలోని వరద ముంపు బాధితులకు నిత్యవసర సరకులు పంపిణీ చేశారు. ఈ మేరకు నగరంలోని భవానీపురం, రాజరాజేశ్వరిపేట, వాంబేకాలనీ, సింగ్‌నగర్ తదితర ప్రాంతాలలో జరిగిన పంపిణీ కార్యక్రమంలో హుబ్లీ మున్సిపల్ కార్పొరేషన్ కార్పొరేటర్ కలకుంట స్వర్ణ పాల్గొని బాధితులకు నిత్యావసరాల కిట్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. హుబ్లీలోని ఏఈఎల్‌సీ చర్చి, సెయింట్ జోన్స్ స్కూల్స్ యాజమాన్యం, దాతల సాయంతో విజయవాడ నగరంలో వరద ముంపునకు గురైన బాధితులకు సాయం అందిస్తున్నామన్నారు. వెయ్యి మంది బాధితులను గుర్తించి వారికి బియ్యం, దుస్తులు, నిత్యావసరాలు అందజేశామని తెలిపారు.